సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



ఇక ఊరూరా బెల్టు

మద్యం దుకాణాలు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు బుధవారం నుంచి వ్యాపారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో బెల్టు షాపులకు రంగం సిద్ధం చేశారు. 10లో



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.25, సరాసరిన రూ.36 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.7°/22.3°

జిల్లాలో మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం




అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందని, ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వాగులు, వంకలను పరిశీలించి వర్షాలు కురిస్తే అక్కడ ఏర్పడే పరిస్థితులను ముందస్తుగా తెలుసుకోవాలన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రజలను అప్రమత్తం చేయాలని, పశుసంపదనూ అక్కడి నుంచి తరలించాలన్నారు. వాగులు, వంకలు, బ్రిడ్జిలు దాటే ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా చెరువుగట్లు బలహీనంగా ఉంటే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, పంచాయతీ, వైద్య,ఆరోగ్య, మున్సిపల్, గ్రామ వార్డు సచివాలయ, విద్యుత్ శాఖల అధికారులు వారి పరిధిలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆయన సూచనలు చేశారు. అలాగే కలెక్టరేట్‌లో 08555-283030 నంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించామన్నారు. అత్యవసర సమయంలో కంట్రోల్‌రూంకు ఫోన్‌చేసి సాయం పొందవచ్చన్నారు.

ఆయకట్టుపై ఆధిపత్యం!

'అంతా మాదే..అన్నీ మాకే' అంటూ రెచ్చిపోతున్న అధికార టీడీపీ నేతలు ఆయకట్టుపై ఆధిపత్యం కోసం ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే సాగునీటి సంఘాల ఎన్నికలకు తెరతీశారు. జిల్లాలో 230 మైనర్, మీడియం సాగునీటి సంఘాలుండగా.. అన్నింటి అధ్యక్షులుగా 'తమ్ముళ్ల'నే ఎన్నిక చేసి గ్రామాల్లో రైతులపై అజమాయిషీ చేసేందుకు సిద్ధమయ్యారు. తద్వారా రాజకీయంగా బలపడాలని ప్లాన్ వేశారు.

- సాగునీటి సంఘాల ఎన్నికలకు అడుగులు
- నేడు నోటిఫికేషన్.. నవంబర్ 18న ఎన్నికలు
- జిల్లా పరిధిలో 230 సంఘాలు
- అన్నీ తెలుగు తమ్ముళ్లకే అప్పగించేలా టీడీపీ ప్లాన్



సాగునీటి సంఘం ఎన్నికలు జరగనున్న వెంగళమ్మచెరువు గ్రామ చెరువు

పుట్టపర్తి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం (ఈనెల 16వ తేదీ) నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నవంబర్ 18వ తేదీన ఎన్నికలు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలిచ్చింది. దీంతో యంత్రాంగం ఓటరు జాబితాను సిద్ధం చేస్తోంది.

జిల్లాలో 230 సాగునీటి సంఘాలు..

జిల్లాలో 230 సాగునీటి సంఘాలున్నాయి. ఇందులో అత్యధికంగా పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో 135 సాగునీటి సంఘాలు. ఆ తర్వాత ధర్మవరంలో 35, పుట్టపర్తిలో 26, కదిరిలో 18 ఉన్నాయి. మీడియం సాగునీటి సంఘాల్లో పెనుకొండ డివిజన్‌లో పెన్నా కుముద్వతీ ప్రాజెక్టు కింద 5 సంఘాలు, ధర్మవరం డివిజన్‌లో అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కింద 5, యోగి వేమన రిజర్వాయర్ కింద 6 కలిపి 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఈ సాగునీటి సంఘాలకు ఆరుగురు టీసీ (టెరిటోరియల్ కానిస్టెన్సీ)మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇద్దరు, నలుగురు టీసీలు ఉంటారు. ఇందులో ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారు. జిల్లాలో గతంలో సుమారు 1.20 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. నూతన ఓటరు జాబితాను ఈనెలలో రెవెన్యూ అధికారులు తయారు చేయాల్సి ఉంది.

వాటా కోసం పోటీ..

చెరువులు అభివృద్ధి చేయడం, జంగిల్ క్లియరెన్స్, వర్షపునీరు వచ్చే కాలువలు, ఆయకట్టుకు అనుసంధానంగా ఉండే కాలువలను అభివృద్ధి చేయడంలో సాగునీటి సంఘం కీలకంగా వ్యవహరిస్తుంది. పంచాయతీలు, మత్స్యశాఖ సహకారంతో చెరువుల్లో చేపల పెంపకం, అమ్మకంలో వచ్చే వాటా నిధులను వినియోగించుకొని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అలాగే చెరువు గట్లపై ఉన్న చింత చెట్ల రాబడి ఈ సంఘాలకే దక్కుతుంది. దీంతో ఈ వాటా కోసం నేతల నుంచి పోటీ పెరుగుతోంది.

పెత్తనం కోసమే ఎన్నికలు..

సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉంటూ రైతులందరినీ చెప్పుచేతుల్లో ఉంచుకుని గ్రామంలో పెత్తనం చేసేందుకు టీడీపీ నేతలు ప్లాన్ చేశారు. తద్వారా రాజకీయంగా తమ పలుకుబడి పెంచుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకుల నుంచి పదవుల కోసం ఒత్తిడి ఎక్కువైంది. దీంతో వారికి ఏదో ఒక పదవి కట్టబెట్టాలని ఆ పార్టీ అధిష్టానం సిద్ధమైంది. ఈ క్రమంలోనే సాగునీటి సంఘాల ఎన్నికలను తెరపైకి తెచ్చింది. దీంతో టీడీపీ జిల్లా నేతలు కూడా సాగునీటి సంఘాల్లో అత్యధిక స్థానాలు దక్కించుకుని తద్వారా జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు పొందాలని భావిస్తున్నారు. మద్యం షాపులకే బెదిరింపులు, కిడ్నాపుల వరకూ వెళ్లిన టీడీపీ నేతలు.. ఆరేళ్ల పాటు అధికారంలో ఉండే ఈ సంఘాల ఎన్నికల్లో ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తారో వేచి చూడాలి.

రాజకీయాలకు తావివ్వొద్దు



రాజకీయాలకు తావు లేకుండా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. సంఘం అధ్యక్షులుగా ఎవరు ఎన్నికైనా చెరువు అభివృద్ధికి కృషి చేయాలి. ఆయకట్టు రైతులకు మేలు చేసేలా ఉండాలి. అంతేగానీ ఈ ఎన్నికలను రాజకీయంగా ఉపయోగించుకోకూడదు.

– నరసారెడ్డి, వెంగళమ్మచెరువు

ప్రతి రైతుకూ ఓటు హక్కు కల్పించాలి



సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు కింద భూమి ఉన్న ప్రతి రైతుకూ ఓటు వేసే అవకాశం కల్పించాలి. గ్రామాల్లో సభలు నిర్వహించి ముందస్తు సమాచారం ఇవ్వాలి. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా చూడాలి.

– మాధవరెడ్డి, రైతు, బీడుపల్లి

నిబంధనల మేరకే ఎన్నికలు

సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తాం. 16వ తేదీ బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తాం. నవంబర్ 18వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తాం. 16వ తేదీ నుంచి ఆయకట్టు దారుల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తారు. ఒక రైతుకు ఎన్ని చోట్ల భూమి ఉన్నా ఒక ఓటే ఉంటుంది.

– గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇరిగేషన్ శాఖ

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

పుట్టపర్తి అర్బన్: అల్పపీడనం ప్రభావంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా జడివాన కురిసింది. అత్యధికంగా హిందూపురం మండలంలో 26.4 మి.మీ, ఎన్‌పీ కుంట మండలంలో 23.4 మి.మీ, లేపాక్షి మండలంలో 23.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక నల్లచెరువు 22, తలుపుల 21.2, తనకల్లు 20.8, గాండ్లపెంట 17.6, రొళ్ల 16.2, ఓడీచెరువు 15.2, గోరంట్ల 14.4, అమడగూరు 14, చిలమత్తూరు 12.8, అగళి 12.4, కదిరి 11.2, పరిగి మండలంలో 11.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మిగతా మండలాల్లోనూ 2 మి.మీ నుంచి 8 మి.మీ మేర వర్షపాతం నమోదైందన్నారు. తుపాను ప్రభావం జిల్లాపై మరో రెండు రోజులు ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

17 వరకూ పాఠశాలలకు సెలవు

ప్రశాంతి నిలయం: జిల్లా భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు ఈనెల 17వ తేదీ వరకూ మరో రెండు రోజుల సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఇప్పటికే సోమ, మంగళ వారాల్లో పాఠశాలలకు సెలవులు ఇచ్చామన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలలన్నీ సెలవు ఇవ్వాలన్నారు.

వాటా ఇస్తారా.. వదులుకుంటారా?

- మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిపై మంత్రి సవిత అనుచరుల ఒత్తిళ్లు
- సోమందేపల్లి దుకాణం దక్కించుకున్న సవిత అనుచరులు
- పెనుకొండ దుకాణదారుడికీ బెదిరింపులు.. ఎంపీ బీకే చెంతకు పంచాయితీ

పెనుకొండ: లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వారికి మంత్రి సవిత అనుచరులు వార్నింగ్ ఇస్తున్నారు. అడిగినంత వాటా ఇవ్వాలని, లేకపోతే ఇచ్చినంత తీసుకుని దుకాణం తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. సోమందేపల్లిలో దీక్షిత్ అనే వ్యక్తికి మద్యం దుకాణం దక్కగా...అతన్ని బెదిరించిన మంత్రి వర్గీయులు దుకాణం తామే నడిపేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.



ఎంపీ బీకే ఇంటి వద్ద మద్యం వ్యాపారుల వాహనాలు

ఎంపీ బీకే వద్దకు పరుగులు..

సోమందేపల్లిలోనే మరో దుకాణం దక్కించుకున్న వ్యక్తితో మంత్రి సవిత వర్గీయులు బేరసారాలకు దిగారు. తమకు 75 శాతం వాటా ఇవ్వాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇందుకు నిరాకరించిన సదరు వ్యక్తి... ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులను సంప్రదించి వ్యవహారాన్ని చక్కబెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రసాద్ అనే వ్యక్తినీ మంత్రి వర్గీయులు బెదిరించగా, అతను ఖాతరు చేయలేదు. అతనికి ఎంపీ బీకే వర్గీయులు అండగా నిలచినట్లు సమాచారం. మంత్రి సవిత వర్గీయుల హెచ్చరికల నేపథ్యంలో మద్యం షాపులు దక్కించుకున్న వారు మంగళవారం ఎంపీ బీకే పార్థసారథి ఇంట్లో ఆయన అల్లుడు శశిభూషణ్‌తో సమావేశమై ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

ధర్మవరం అర్బన్: సత్ప్రవర్తనతో మెలగాలని సబ్ జైలు ఖైదీలకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ పిలుపునిచ్చారు. ధర్మవరంలోని సబ్‌జైలును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూం పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఖైదీలకు కోర్టు కేసుల్లో వాదనలు వినిపించేందుకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.

బెంగళూరు - కలబురిగి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగుళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30, నవంబర్ 2వ తేదీన బెంగుళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు రైలు (06533) బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కలబురిగి జంక్షన్‌కు చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈ నెల 31, నవంబర్ 3న కలబురిగి జంక్షన్ నుంచి ఉదయం 9.35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.00 గంటలకు బెంగుళూరు జంక్షన్‌కు చేరుతుంది. మార్గం మధ్యలో యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాబాద్ స్టేషన్లలో నిలుస్తుంది.

టీడీపీ నేత దాడి



గాయపడిన నేలకోటప్ప

చెన్నేకొత్తపల్లి: భూ వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేత దాడి చేశాడు. సీకేపల్లి మండలం కనుముక్కలలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నేలకోటప్పకు టీడీపీకి చెందిన మద్దిలేటి నేలకోటప్ప మధ్య కొన్నేళ్ళుగా భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్దిలేటి నేలకోటప్ప కర్రతో నేలకోటప్పపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయమైన నేలకోటప్పను కుటుంబసభ్యులు వెంటనే సీకే పల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కూటమి నేతల్లో లుకలుకలు

చిలమత్తూరు: మండలంలో కూటమి నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. టీడీపీ నేతల తీరుపై బహిరంగంగానే బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు. మంజూరైన పనులు, ఇసుక, మట్టి వ్యాపారాలు కేవలం టీడీపీ నేతలే చేసుకుంటుండడంతో బీజేపీ నేతలకు మింగుడుపడటం లేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ఆహ్వానం పలకకుండా అవమానిస్తుండటంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు తీరు మార్చుకుని పొత్తు ధర్మాన్ని పాటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు హరినాథరెడ్డి హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కూటమిగా ఏర్పడితేనే అధికారం లభించిందన్న విషయాన్ని టీడీపీ, జనసేన నేతలు గుర్తెరిగి మసలుకోవాలన్నారు.

ఇక ఊరూరా 'బెల్టు'!

- నేటి నుంచి కొత్త మద్యం పాలసీ
- జిల్లాలో 87 ప్రైవేటు మద్యం షాపుల ద్వారా విక్రయాలు
- గ్రామాల్లో బెల్టు షాపులు నడిపేందుకు రంగం సిద్ధం



ఎక్కడైనా దుకాణం ఏర్పాటు..

పుట్టపర్తి టౌన్: మద్యం దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి వెళ్లడం... ఊరూరా బెల్టుషాపుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. మద్య నియంత్రణ భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు దుకాణాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచుకుని మద్యం సరఫరా చేయగా, కూటమి ప్రభుత్వం పాత మద్యం పాలసీని రద్దు చేసి దుకాణాల సంఖ్యను పెంచి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. సోమవారం లాటరీ విధానం ద్వారా షాపులు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు బుధవారం నుంచి వ్యాపారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వం రాత్రి 10 గంటల వరకే అనుమతి అని చెబుతున్నా...దుకాణాలన్నీ టీడీపీ నేతలే దక్కించుకున్న నేపథ్యంలో అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగనున్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 65 షాపులు ఉండేవి. ఇవన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచేవి. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకు వచ్చింది. అలాగే 22 షాపులను పెంచి మొత్తంగా 87 దుకాణాల ఏర్పాటుకు లాటరీ తీసింది. దుకాణాలు దక్కించుకున్న ప్రైవేటు వ్యాపారులు నేటి నుంచి వైన్ షాపులు ప్రారంభించనున్నారు. దుకాణాల ఏర్పాట్లలో గతంలో ఉన్న నిబంధనలు తొలగించిన నేపథ్యంలో మండలం, మున్సిపాలిటీ యూనిట్‌గా నిర్ణయించారు. దీంతో మద్యం షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఒకే ప్రాంతానికి కేటాయించిన మూడు దుకాణాలు ఒకే చోటు ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగించవచ్చు. ఈ కారణంగా కూటమి నాయకులు సిండికేట్ అయ్యి ఇష్టానుసారం అమ్మకాలు చేసుకునే సౌలభ్యం ప్రభుత్వమే కల్పించింది.

జనాభాను ఆధారంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు..

లాటరీలో మద్యం దుకాణాలు పొందిన వారంతా అమ్మకాలు పెంచుకొనేందుకు గ్రామాల్లో , పట్టణాల్లో ఎక్కడెక్కడ బెల్టుషాపులు తెరవాలనే పనిలో ఉన్నారు. కొందరు ఇప్పటికే ఆయా గ్రామాలను గుర్తించి అక్కడ తమ అనుచరుల ద్వారా మద్యం విక్రయాలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. గ్రామ జనాభాను బట్టి రెండు నుంచి ఆరు దాకా బెల్టు షాపులు, పట్టణ పరిధిలో మరిన్ని పెంచేందుకు పావులు కదుపుతున్నారు. ఇలా చేస్తే జిల్లాలో సుమారు వెయ్యి బెల్టు షాపులు రావచ్చని అంచనా. కొన్ని చోట్ల ఇప్పటికే బెల్టు షాపులు నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకొన్నట్లు తెలుస్తోంది.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అమడగూరు: గొర్రెల దొంగతనం కేసులో అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఓడీచెరువు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న రాత్రి మిట్టపల్లి నివాసి రంగయ్య నాయుడుకు చెందిన పది గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా సమాచారంతో మంగళవారం ఉదయం ఓడీచెరువు మండలం మల్లాపల్లి సమీపంలో పది గొర్రెలు ఆటోలో తరలిస్తున్న నలుగురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. గొర్రెలను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో బాపట్లకు చెందిన బండి శశికుమార్, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఓడీచెరువు మండలం మిట్టపల్లికి చెందిన పులి వరప్రసాద్, చీరాలకు చెందిన కోనేటి పాల్‌రాజు ఉన్నారు. మద్యానికి బానిసలైన వీరు తమ జల్సాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కంట్రోల్ రూం పరిశీలన



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ

ప్రశాంతి నిలయం: భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం తెలపాలన్నారు.

అత్యాచార నిందితులను వెలివేయాలి

- ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు షేక్ రుకియాబేగం



మాట్లాడుతున్న రుకియాబేగం

హిందూపురం టౌన్: ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన దోషులను సమాజం నుంచి వెలివేయాలని రాష్ట్ర ఉమెన్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు షేక్ రుకియాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ ఉపాధి కోసం కర్ణాటక నుంచి వలస వచ్చి డబ్బు సంపాదించి ఆడబిడ్డకు పెళ్లి చేయాలనే విషయం వారి మాటల ద్వారా తెలిసిందన్నారు. ఇలాంటి ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడేలా కఠిన చట్టాలను తీసుకువచ్చేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడుతామన్నారు. దోషులకు బెయిల్ కూడా ఇవ్వరాదన్నారు. బాధితులకు ఉమెన్ ప్రొటెక్షన్ కమిషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, సీడీపీఓ రెడ్డిరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. కాగా, అత్యాచార బాధితులను స్థానిక ఆస్పత్రిలో ఎస్పీ రత్న మంగళవారం సాయంత్రం పరామర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అధైర్య పడకూడదని, పోలీసు శాఖ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

రీచ్‌ల్లోనే ఇసుక బుకింగ్

- కలెక్టర్ టీఎస్ చేతన్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ నిబంధనల మేరకు రీచ్‌లలోనే ఇసుక బుకింగ్ చేసుకుని తీసుకువెళ్లవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులు ఆఫ్‌లైన్ ద్వారా ఇసుక పొందవచ్చన్నారు. మంగళవారం రాష్ట్ర భూగర్భ గనుల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొని జిల్లా ఇసుక బుకింగ్, సరఫరా గురించి వారికి వివరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. బుధవారం నుంచి బత్తలపల్లి మండల పరిధిలోని సీసీ రేవు, ముదిగుబ్బ మండల పరిధిలోని పీసీ రేవు పాయింట్‌లలో నేరుగా ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇసుక కావల్సిన వారు ఆధార్ కార్డుతో రీచ్ ఉన్న ప్రాంతానికి వెళ్లి మొబైల్ నంబరు, భవన నిర్మాణ పనుల వివరాలు తెలియజేసి ఇసుకను అక్కడే బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

గోరంట్ల: స్థానిక రావికుంట చెరువులో మంగళవారం ఉదయం ఓ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పంచాయతీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతురాలిని గోరంట్లలోని జామీయ మసీద్ వీధికి చెందిన బీబీజాన్ (80)గా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. మతిస్థిమితం లేని ఆమె మూడు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిందని తెలిపారు. తాము నివాసముంటున్న ప్రాంతానికి సమీపంలో ఉన్న చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు గురుప్రసాద్

తలుపుల: మండలంలోని ఉబ్బరవాండ్లపల్లికి చెందిన గురుప్రసాద్ (19) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల తెలిపిన మేరకు... గురుప్రసాద్ తండ్రి రవికుమార్ గత నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. ఆయన చేసిన అప్పులు రూ.5 లక్షల వరకు ఉన్నాయని తెలుసుకున్న గురుప్రసాద్ వాటిని ఎలా తీర్చాలో తెలియక నెల రోజులుగా మదనపడుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన గురుప్రసాద్ మంగళవారం ఇంట్లోనే రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి సాయిలీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నల్లచెరువు: మండలంలోని రమణప్పగారిపల్లి, కె.పూలకుంట గ్రామాల్లో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని 90 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో తనకల్లు మండలం చిన్న చెరువుపల్లికి చెందిన పవన్, కె.పూలకుంట గ్రామానికి చెందిన బషీర్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ షెక్షావలి తెలిపారు.

వీడు మామూలోడు కాదు !

- గ్యాంగ్‌రేప్ కేసు ప్రధాన నిందితుడు నాగేంద్రకు భారీ నేరచరిత్ర
- 37కు పైగా కేసులు



ఎరికల నాగేంద్ర



సాకే ప్రవీణ్‌కుమార్

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో నిర్మాణ దశలో ఉన్న పేపర్‌మిల్లు వద్ద దసరా పండుగ నాడు వాచ్‌మెన్ కుటుంబంపై దాడిచేసి..ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులు పలు దారి దోపిడీలు, అత్యాచార కేసుల్లో నిందితులుగా ఉన్నారు. తాగుడు, జల్సాలకు అలవాటు పడి చోరీలను వ్యసనంగా మార్చుకున్నారు. ముఖ్యంగా హిందూపురం త్యాగరాజనగర్‌కు చెందిన ప్రధాన నిందితుడు ఎరికల కావడి నాగేంద్రకు భారీ నేర చరిత్ర ఉంది. మొదట చిన్నచిన్న చోరీలతో నేర ప్రస్థానాన్ని ప్రారంభించాడు. మద్యం, గంజాయి, అమ్మాయిల సుఖానికి అలవాటు పడ్డ ఇతను నేరాలే పనిగా పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఇప్పటిదాకా 37కు పైగా కేసులు ఉన్నాయంటేనే ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడో అర్థం చేసుకోవచ్చు. ఇతనిపై హిందూపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మూడు చోరీ కేసులు, రూరల్ పీఎస్‌లో రెండుచోరీ కేసులు, మద్యం కేసులు, ఆదోని టూటౌన్ పీఎస్‌లో రెండు చోరీ కేసులు నమోదయ్యాయి. కుప్పం ప్రాంతంలోనూ చోరీలు చేసిన నేపథ్యం ఉంది. గత ఏడాది గోరంట్లలో ఇతనితో పాటు కలిసి పనిచేసిన ఇల్లూ అనే వ్యక్తిని హత్యచేశాడు. హిందూపురం సమీపంలోని ఓ కళాశాల పరిసరాల్లో ఉంటూ విద్యార్థులు జంటగా లేదా ఒంటరిగా కనిపిస్తే బెదిరించడం, కొట్టడం వంటివి చేశాడు. అమ్మాయిలను రేప్ చేసి.. ఆ దృశ్యాలను చిత్రీకరించి ఎక్కడైనా చెబితే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించిన ఘటనలూ చాలా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికంగా హైవేలు, మారుమూల దారుల్లో చోరీలు చేసినట్లుగా పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. త్యాగరాజనగర్ ప్రాంతానికే చెందిన మరో నిందితుడు సాకే ప్రవీణ్‌కుమార్‌పై లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. ఇక పరారీలో ఉన్న చాకలి శ్రీనివాసులు అలియాస్ శ్రీనాథ్ హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఇతని స్వగ్రామం లేపాక్షి మండలం కల్లూరు కాగా..ప్రస్తుతం హిందూపురం త్యాగరాజనగర్ గుడ్డం ఏరియాలో నివాసం ఉంటున్నాడు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రశాంతి నిలయం: జన సంరక్ష, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. ఆయా పథకాల అమలుపై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. పథకాలపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. జిల్లాలోని 467 గ్రామ పంచాయతీల్లో జనవరి 15 వరకూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపునకు చర్యలు తీసుకోండి..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. వయోజన విద్య అంశంపై మంగళవారం వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసం అనే పేరుతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలోని నిరక్ష్యరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, అవగాహన, కుటుంబ సంక్షేమం, డిజిటల్ అక్ష్యరాస్యత తదతర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమం అమలులో స్వచ్ఛంద సేవ సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డైరెక్టర్ ఆంజనేయులు, ఏపీఓ సుబ్రహ్మణ్యంరెడ్డి, సూపర్‌వైజర్ మధుసూదన్, డీఈఓ మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డీపీఓ మమతా తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణెంపై అపోహలొద్దు



ప్రచారం చేస్తున్న కెనరాబ్యాంకు అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రూ.10 నాణెంపై అపోహలు వద్దని, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెలామణి చేసుకోవచ్చని కెనరాబ్యాంకు అధికారులు తెలిపారు. ఈ అంశంపై మంగళవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ సెంథిల్‌కుమార్, మేనేజర్ దివ్య ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. రూ.10 నాణెం చెలామణిలో లేదంటూ ఇటీవల కొందరు దుష్ప్రచారం సాగిస్తున్నందున సమస్య ఎదురవుతోందన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు చెలామణిలో ఉన్నందున మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. స్వీట్ షాప్స్, టీకొట్లు, ఇతర దుకాణాదారులకు రూ.10 నాణెలు అందజేశారు.

చేనేత కార్మికుడి బలవన్మరణం

తాడిపత్రి రూరల్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్నపొలమడకు చెందిన రంగనాయకులు (50)కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో పదేళ్ల క్రితం తన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభ్యం కాక అప్పట్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కూరుకుపోయిన ఆయన విషపు గుళ్లికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స అందివ్వడం ద్వారా ప్రాణాలతో బయటపడ్డాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం సోకింది. అప్పటి నుంచి భార్య లక్ష్మీదేవి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పక్షవాతం కారణంగా ఏ పనీ చేయలేకపోతున్నాననే ఆవేదన రంగనాయకులను వేధిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే కుటుంబంలో మరోసారి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం చిన్నపొలమడ సమీపంలో పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఐక్యత చాటడానికి సైకిల్ యాత్ర



తరలి వెళుతున్న సైకిల్ యాత్రికుడు

సోమందేపల్లి: భారత దేశంలో సర్వ మతాలు ఒకటేనంటూ ఐక్యత చాటేలా రేస్ అక్రాస్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన నలుగురు యువకులు సైకిల్ యాత్ర చేపట్టారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ తలపెట్టిన ఈ యాత్ర మంగళవారం సోమందేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికులతో వారు కొద్ది సేపు మాట్లాడారు. భారతీయులందరూ కలిసి మెలిసి మెలగాలని సైకిల్ యాత్రికుడు భాస్కర్ తెలిపారు. 3,723 కి.మీ. మేర తన సైకిల్ యాత్ర కొనసాగుతుందన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన వివాహిత లక్ష్మీదేవి కనిపించకుండా పోయారు. దీనిపై భర్త అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఆమె కనిపించడం లేదని ఫిర్యాదులో భర్త పేర్కొన్నాడు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువులు, మిత్రుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లక్ష్మీదేవి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

రంగనాథ్‌కు షాపు దక్కుతుందా?

- లేపాక్షి 57వ నంబర్ దుకాణం కేటాయింపుపై వీడని ఉత్కంఠ

పుట్టపర్తి టౌన్: లేపాక్షి మండలంలోని 57వ నంబర్ మద్యం దుకాణం కేటాయింపుపై ఉత్కంఠ నెలకొంది. ఈ దుకాణం లాటరీలో చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన చెందిన రంగనాథ్‌కు దక్కింది. దీంతో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచరులు అతను డిపాజిట్ చెల్లించకుండా ఎత్తుకెళ్లి బెదిరించారు. ఈక్రమంలో రంగనాథ్ భార్య పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సోమవారం రాత్రి వదిలేశారు. దీంతో అతను సోమవారం డిపాజిట్ మొత్తం చెల్లించలేకపోయారు. మంగళవారం డిపాజిట్ మొత్తం చెల్లించినా.. ఎక్సైజ్ అధికారులు లైసెన్స్‌కు అనుమతి ఇవ్వలేదు. దీంతో రంగనాథ్ కుటుంబసభ్యులు పుట్టపర్తిలో జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదని అధికారులు దాటవేసే ప్రయత్నం చేశారు. బుధవారం చూస్తామని చెప్పడంతో రంగనాథ్ కుటుంబీకులు వెనుదిరిగారు. లాటరీలో షాపు దక్కినా రంగనాథ్‌కు లైసెన్స్ దక్కుతుందా..? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ నాయకులే అధికారుల అండతో తమకు లైసెన్స్ రాకుండా చేస్తున్నారని రంగనాథ్ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

19 నుంచి రాజమాత జీజాబాయి ట్రోఫీ

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారిగా ఆర్డీటీ సౌజన్యంతో అనంతపురం క్రీడాగ్రామం వేదికగా ఆల్ ఇండియా జోనల్ స్థాయి రాజమాత జీజాబాయి ట్రోఫీ సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఎం. డేనియల్ ప్రదీప్ మంగళవారం తెలిపారు. టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌కు అభినందనలు తెలిపారు. కాగా, ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ అనంతపురంతో పాటు ఒడిశా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఈ టోర్నీ సమాంతరంగా జరుగుతుంది. 16 రాష్ట్రాల జట్లు టోర్నీలో పాల్గొంటాయి.

కనుల పండువగా లక్ష్మీరంగనాథుడి జాతర







ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి మూలవిరాట్, రథంపై కొలువుదీర్చిన ఉత్సవ విగ్రహాలు

అగళి: మండలంలోని నరసంబుదిలో వెలసిన రంగనాథస్వామి జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్నారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. వేకుజామునే విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం రథంపై ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి మేళతాళాలతో ఊరేగించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి